వరిరైతు కుదేలు

- దళారుల చేతుల్లో మోసపోతున్న అన్నదాతలు
- గిట్టుబాటు ధర కంటే చాలా తక్కువకు కొనుగోలు
- పెట్టుబడులు కూడా చేతికందని వైనం
- ఆందోళనలో రైతన్నలు



బండినాయిని పాలెంలో కోతకోసిన వరి ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఆరుగాలం శ్రమించి కష్ట నష్టాలకు ఓర్చి పండించిన పంటలకు సరైన ధర దక్కకపోవడంతో రైతన్నలు కుదేలవుతున్నారు. చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్మి అప్పులు తీర్చుకుందాం అనుకున్న అన్నదాత దళారుల చేతుల్లో మోసపోతూ నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర క్వింటాకు రూ.2300 ప్రకటిస్తే దళారులు మాత్రం రూ.1400 నుంచి రూ.1550 లోపు కొనుగోలు చేస్తుండటంతో పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది.

ప్రారంభమైన కోతలు

మండలంలోని గువ్వలకుంట్ల, బండినాయిని పాలెం, వీరాపురం, కొత్తపల్లి, బావాపురం, నందికుంట, శివపురం, గుమ్మడాపురం గ్రామాలలో ఆయకట్టు కింద, వర్షాధారంపై రైతులు వరి పంటలను సాగు చేసుకుంటారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 9 వేల హెక్టార్లు అయితే ఈ గ్రామాలలో మాత్రమే 1,092 హెక్టార్లలో వరిపంటను సాగుచేశారు. ప్రస్తుతం పంటలు కోత దశకు రావడంతో రైతన్నలు కోతలు, నూర్పిడి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కర్నూలు సోనా మసూరి ఎకరాకి 25 నుంచి 30 బస్తాలు, నంద్యాల సోనా ఎకరాకు 25 నుంచి 28 బస్తాలు, ఇంకో రకం ఎంటీయూ 1264 ఎకరానికి 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది.

ధరల్లో దళారుల చేతివాటం

కేంద్రం వరికి మద్దతు ధర క్వింటా రూ.2,300 ప్రకటించింది. ఈ లెక్కన బస్తా రూ.1,748 చొప్పున దళారులు కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ దళారులు వారి చేతివాటం చూపుతూ బస్తాను నంద్యాల సోనా రూ.1,550, కర్నూలు సోనా రూ.1,400, ఎంటీయూ రకం రూ.1100లకు మాత్రమే కొనుగోలు చేస్తూ కర్షకులను దగా చేస్తున్నారు. ఇదే గతేడాది నంద్యాల సోనా రూ.2,600, కర్నూలు సోనా రూ.2,400, ఎంటీయూ 1264 రకం రూ.1,800లకు అమ్ముడుపోయాయని ఇప్పుడు ఎందుకు ఇంత తక్కువ ధరకు అడుగుతున్నారని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. కాగా సొంత పొలం ఉన్న రైతుకు ఒక ఎకరానికి రూ.40 వేలు, కౌలురైతు అయితే రూ.60వేలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే చివరికి నష్టాలే చవిచూడాల్సి వస్తుందని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



గువ్వలకుంట్లలో ఇంటివద్ద ఆరబెట్టిన వరి

రూ.30 వేల అప్పు మిగిలింది



నేను బావాపురం గ్రామ సమీపంలో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశా. అధిక వర్షాలకు వరి పంట పడిపోయి దిగుబడి తగ్గిపోయింది. నాలుగు ఎకరాలకు కలిపి 100 బస్తాలు వచ్చింది. పెట్టుబడి సుమారు రూ.2లక్షల దాకా అయ్యింది. ఇప్పుడు గిట్టుబాటు ధరలేదు. ధాన్యం అమ్మితే పెట్టుబడి మాట అటు ఉంచితే ఇంకా నేనే రూ.30 వేలు అప్పుపడుతున్నా. తెచ్చిన అప్పులే దిద్దుకోలేక పోతుంటే ఇంకా అప్పుపెరిగింది. ఏంచేయాలో దిక్కుతోచడం లేదు.

– చంద్రమౌళి, కౌలురైతు, గువ్వలకుంట్ల

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



నేను మూడు ఎకరాలలో కర్నూలు సోనా మసూరి సాగుచేశా. ఎకరానికి సుమారు రూ.40వేల దాకా పెట్టుబడి పెట్టా. అయితే దిగుబడి 30 బస్తాలు మాత్రమే వస్తోంది. దళారులు మాత్రం మావద్ద నుంచి బాస్తా రూ.1,400 లకు మాత్రమే కొంటున్నారు. ఈ ధరకు అమ్మితే కనీసం పెట్టుబడికూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– స్వామిదాసు శంకరన్న ,రైతు, వీరాపురం

క్లుప్తంగా

మహానంది సూపరింటెండెంట్‌గా శశిధర్‌రెడ్డి

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డికి సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులను అందాయి. ఆలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన శశిధర్‌రెడ్డిని ఏఈఓ ఎరమల మధు, ఆలయ సిబ్బంది అభినందించారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత గురువారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో పట్టణంలోని పద్మావతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆశ మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాయిగుణ అశ్విని డిబెట్ పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యలపై అవగాహనుండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యాయవాదులు, సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కలిగి వారికి చేయూత నివ్వాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆత్మకూరు కోర్టుల సముదాయంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లడారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటేశ్వర్లు, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కేశవ

కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎస్ఐ కేశవ గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌లపై ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఇతరుల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలు ఇతరుల ప్రవర్తనను గుర్తించాలన్నారు. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేయాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ఓబులేసు

మిడుతూరు: సీసీ కెమెరాలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకుంటే అన్నివిధాలుగా ఉపయోగకరమని ఎస్ఐ ఓబులేసు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల పెద్దలతో ఎస్ఐ సమావేశమయ్యారు. సీసీ కెమెరాల ఏర్పాటు, కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన కుడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దొంగతనాలు, మిస్సింగ్ కేసు తదితర నేరాలను నియంత్రణ ఉపయోగపడతాయని చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: సీసీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాల రహదారి నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం చింతలపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఇంటిని జియోటాగింగ్, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ కార్డు అనుసంధానం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చెప్పారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు నిత్య కల్యాణోత్సవంలో భాగంగా శనివారం కల్యాణ మహోత్సవం కనులపండుగగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో కల్యాణ మహోత్సవం వేదోక్తంగా చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్థానిక యాగశాలలో మహానందీశ్వర దంపతులకు ఏకాంత సేవ పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు.

మహానందిలో ఆకట్టుకున్న భజన కార్యక్రమాలు

కార్తీక మాసం అలంకార మండపంలో బండిఆత్మకూరు మండలం జీసీపాలెం గ్రామానికి చెందిన శ్రీరామ భజన మండలి, కలుగొట్ల గ్రామానికి చెందిన చెన్నకేశవ భజన మండలి కళాకారుల భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మహానందీశ్వరస్వామి దేవస్థానం భజన కొలువు బొల్లవరం రాముడు ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు

మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన గుత్తి పట్టణానికి చెందిన సువర్ణ, గోపాల్ దంపతుల కుమార్తె రిషిత శనివారం తప్పిపోయింది. సమాచార కేంద్రం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది మధు పాపను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

26న కార్మికుల మహాధర్నా

నందికొట్కూరు: కార్మికులు, కర్షకులు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మిక సమస్యలపై సానుకూలంగా కేంద్రం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వీరస్వామి, శంకర్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న కార్మిక, కర్షక హక్కుల కోసం జిల్లా కేంద్రం నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ రైతు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే మహా ప్రదర్శనలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని సింగరాజుపల్లి, చిన్న గుమ్మడాపురం, ముసలిమడుగు గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు నంద్యాల నూనెపల్లి బ్రిడ్జి దగ్గర నుంచి మహా ప్రదర్శన ప్రారంభమవుతుందని, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవకుమార్, ప్రసాద్, సంసోను, ఏసేపు, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు. , సంసోను, ఏసేపు, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తూకం వేయకుండానే డీలర్లకు బియ్యం సరఫరా

ఆత్మకూరు: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న బియ్యం స్టాక్ పాయింట్ కేంద్రంలో డీలర్లకు బియ్యాన్ని తూకం వేయకుండానే సంబంధిత అధికారి సరఫరా చేస్తున్నట్లు ఆత్మకూరు డీలర్ల అసోసియేషన్ నాయకుడు వెంకటరమణ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు స్టాకు పాయింట్‌లో డీలర్లకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల సరుకులను తూకం వేయకుండా సరఫరా చేయడం వల్ల తూకాల్లో భారీ తేడాలు వస్తున్నాయన్నారు. పట్టణంలో ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా, ఓ షాపులో 8.50 క్వింటాళ్ల కేజీల బియ్యం తక్కువగా వచ్చాయన్నారు. డీలర్ స్టాక్ పాయింట్ వద్ద తూకం వేయకుండా బియ్యాన్ని సరఫరా చేయడం వల్ల తూకం తక్కువగా వస్తుందని అధికారులకు చెప్పినా స్పందించలేదన్నారు. ప్రస్తుతం అధికారులు స్పందించి స్టాక్ పాయింట్ వద్ద తప్పనిసరిగా డీలర్లకు తూకం వేసి నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

కొత్తపల్లి: విద్యార్థి బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఆత్మకూరు డిపో నుంచి ఏపీ21జెడ్0734 విద్యార్థి బస్సు కొత్తపల్లి మీదుగా జడ్డువారిపల్లె గ్రామానికి వెళ్తుంది. కొత్తపల్లి నుంచి సుమారు 80 మంది విద్యార్థులతో బయలు దేరింది. ఎదురుపాడు గ్రామం సమీపంలో గేర్‌రాడ్డు వెల్డింగ్ తెగి డ్రైవర్ చేతిలోకి వచ్చింది. దీంతో విద్యార్థులు భయంతో అల్లాడి పోయారు. డ్రైవర్ చాకచక్యంతో బస్సును కిలో మీటరుమేర తీసుకువచ్చి గ్రామంలో ఓ హోటల్ దగ్గర నిలిపి వేశాడు. దీంతో విద్యార్థులకు ప్రమాదం తప్పిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అప్రమత్తతతో బస్సును నడిపి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తీసుకొచ్చిన డ్రైవర్‌ను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడదాం

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నవంబర్ 26న చేపట్టే నిరసను జయప్రదం చేయాలని ఆటో ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ జాతా పట్టణ, మండలంలోని కురుకుంద, వడ్ల రామాపురం, వెంకటాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, ముష్టిపల్లి, సిద్ధపల్లె, బాపనంతపురం, నల్లకాల్వ, కొత్త రామాపురం, కరివేన గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు మాబాషా, సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, అధ్యక్షుడు రజాక్, ఉపాధ్యక్షుడు రణధీర్, నాగేశ్వరరావు, సామేలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ఏజెన్సీ ఉద్యోగులకు వేతనాల మంజూరు

మహానంది: మహానంది దేవస్థానంలో ఏజెన్సీ విభాగంలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు వేతనాలు మంజూరైనట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో నిర్వహిస్తున్న ఏజెన్సీ సంస్థ గడువు పూర్తి కావడంతో ఇటీవల టెండర్లు నిర్వహించగా నూతన ఏజెన్సీ సంస్థ నిర్వహణ బాధ్యతలను పొందింది. దీంతో ఏజెన్సీ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఓ ప్రత్యేక చొరవ తీసుకుని కమిషనర్ కార్యాలయానికి వెళ్లి జీతాల మంజూరుకు కృషి చేశారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని ఈఓ తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాలకు సమ్మర్ స్టోరేజి నుంచి నీటిని సరఫరా చేయకుండా నిధులు కాజేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. సమ్మర్ స్టోరేజీ కాంట్రాక్టర్ గ్రామాలకు నీటిని సరఫరా చేయకుండానే బిల్లులు ఎలా మంజూరు చేస్తారని అధికారులను నిలదీశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో దూసుకొచ్చిన మహిళలు

ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొణిదేల గ్రామానికి ఎస్సీ మహిళలు పెట్రోల్ బాటిల్‌తో సమావేశ భవనంలోకి దూసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే జయసూర్య, అధికారులు అవాక్కయ్యారు. పెట్రోల్ బాటిల్‌తో సమావేశంలోకి ఎలా వస్తారని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే సర్ది చెప్పారు. తమ సమస్యలను అధికారులు పట్టించుకోనందునే వచ్చామని మహిళలు వివరించగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎన్నికల హామీ అమలేదీ?

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల ముందు వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు వేతనం పెంచుతామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు దీనిని అమలు చేయాలని వలంటీర్లు రోడ్డెక్కారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.10వేలకు పెంచాలన్నారు.దీనిపై వెంటనే సర్కారు స్పందించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, వలంటీర్లు, లక్ష్మణ్, మధుశేఖర్, సుధాకర్, భాగ్యలక్ష్మి, స్వరాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారి కె.రవీంద్రనాయక్

ఆత్మకూరు: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారి కె.రవీంద్రనాయక్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి పాదుప్పు మహిళా సమాఖ్య భవనంలో పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం గురించి ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా చూసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. మహిళకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. లీగల్ కన్సల్టెంట్ సుమలత మాట్లాడుతూ పీసీ అండ్ పీఎన్డీటీ చట్టంలోని విషయాలను వివరిస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వారు గర్భంలోని శిశువు ఆడ, మగ తెలియజేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. అనంతరం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు పోషకాహారం వల్ల మంచిచెడుల గురించి రవీంద్రనాయక్ వివరించారు. కార్యక్రమంలో పాదుప్పు మహిళా సమాఖ్య అధికారి పుల్లయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి, పీహెచ్‌సీ గోకవరం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులవాగుకు 895 క్యూసెక్కులు

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటర్ లాక్‌ఇన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 895 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ శనివారం తెలిపారు. సుంకేశుల నుంచి కేసీ కెనాల్‌కు 2400 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందన్నారు. లాక్‌ఇన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్ చానల్‌కు 480 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 65 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రూ. 23లక్షల విద్యుత్ బకాయిలు

మహానంది: మండలంలో అధిక మొత్తంలో విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయని, వాటి వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం మహానందిలోని కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని గృహ, వ్యవసాయ సంబంధిత 16వేల కనెక్షన్లు ఉన్నాయన్నారు. వాటి ద్వారా ప్రతి నెలా రూ. 83లక్షలు డిమాండ్ ఉంటుందని, ఈ నెలలో ఇప్పటికీ రూ. 23 లక్షలు రావాల్సి ఉందన్నా రు. సిబ్బంది వెంటనే వారి వారి గ్రామాల్లో పర్యటిస్తూ బకాయిలను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్‌పై శనివారం ఏపీడీ బాలాజీ నాయక్, ఏపీఓ జయంతి విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో డ్వామా పీడీ జనార్ధాన్ రావు ఆదేశాల మేరకు వారు గ్రామానికి వెళ్లి ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణపై విచారించారు. జిల్లా ఉన్నతాధికారులకు విచారణ వివరాలను అందజేస్తామని వారు తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను గుర్తించాలని, వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ సమస్య అధికంగా ఉందని, సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ ఏఈ రాకపోవడం సరికాదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు సరిగా లేవని, తీగలు కిందకు వేలాడుతున్నాయన్నారు. అలాగే వ్యవసాయ బోర్లకు కనెక్షన్లు కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తహసీల్దార్ రత్నరాధిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కిరయ్య, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జీసీపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆకుమల్ల ఆంజనేయులు కుటుంబానికి రెడ్ క్రాస్ సొసై టీ అండగా నిలిచింది. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు దస్తగిరి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ధోని అల్‌ఫ్రెడ్ చేతుల మీదుగా బాధితులకు నిత్యావసర వస్తువులను, కూరగాయలను అందజేశారు. అలాగే సంతజూటూరుకు చెందిన ఆర్‌ఎంపీ శ్రీనివాసులు 50 కేజీల బియ్యా న్ని అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ ఈశ్వ ర్, రెడ్ క్రాస్ సభ్యులు శ్రీనివాస్, మోహన్, వెంకటేష్, నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

కొత్తపల్లి: పద్దెనిమిదేళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారిణి నాగజ్యోతి సూచించారు. శనివారం మండలంలోని దుద్యాల, నందికుంట, కొత్తపల్లి గ్రామాలలో జరుగుతున్న స్పెషల్ క్యాంపెన్ డే కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ స్పెషల్ క్యాంపెన్ డేలో భాగంగా 25 మంది కొత్తగా ఓటుహక్కుకోసం దరఖాస్తు చేసుకోగా, 4 చేర్పులు, మార్పులు కోసం, 2 చనిపోయినవి తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనంతరం దుద్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై సమాజంలో చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై, బాల్యవివాహాల అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఎస్ఐ కేశవ, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: పట్టణంలో వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద నూతన ఓటరు నమోదు ప్రక్రియను శనివారం ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ నమోదు ఎలా జరుగుతుందో బీఎల్‌వోలను ఆరాతీశారు. అలాగే అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటర్‌గా నమోదు చేయాలన్నారు.

బండిఆత్మకూరు : బండిఆత్మకూరులో జరిగే ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ శనివారం తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 24 దరఖాస్తులు అందాయన్నారు.

న్యాయం చేయండి

పగిడ్యాల: ఆరుగాలం కష్టపడి పండించుకున్నా వరి పైరును కోయకుండా దళిత రైతును అడ్డుకుంటున్న ఉదంతం ఆలస్యంగా శనివారం పడమర ప్రాతకోటలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన దళిత రైతు చిమ్మె సామేలు తనకున్నా ఎకరం పొలానికి తోడుగా పక్కనే ఉన్నా మరో ఎకరాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ప్రస్తుతం పైరు కోత దశకు వచ్చింది. ఇతని పొలం పక్కనే ఉన్న రైతు పలుచాని శేఖర్‌రెడ్డి తరచూ పొలానికి నీరు కట్టి పొలం ఆరకుండా వేధిస్తున్నాడని బాధితరైతు వాపోతున్నాడు. వరి గింజలు నేలపాలు అవుతాయని దళిత రైతు వరి కోత మిషన్ తీసుకుని శుక్రవారం పొలానికి వెళ్లగా తన పొలం మీదుగా వెళ్లరాదని రైతు పలుచాని శేఖర్‌రెడ్డి అడ్డుకున్నారు. పూర్వం నుంచి రస్తా ఉన్నప్పటికీ తనను అడ్డుకుంటున్నాడని బాధిత రైతు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు.